క్లుప్తంగా

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోండి



మోపిదేవి: ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవి పశువైద్య కేంద్రంలో పశువుల దాణాను మంగళవారం పశుపోషకులకు అందజేశారు. ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, దిడ్ల జానకీరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ



పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజా రమేష్, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 180 మందికి 169 మంది హాజరయ్యారని, 11 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 109 మందికి 85 మంది హాజరయ్యారని, 24 మంది ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్లలో 289 మందికి 254 మంది హాజరవ్వగా 35 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని వారు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ తృతీయ వార్షికోత్సవం



కృత్తివెన్ను: గాంధీనగరంలోని శ్రీ అభయసిద్ధి విఘ్నేశ్వరస్వామి తృతీయ వార్షిక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు, గణపతి హోమం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం



చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాలకు విరాళంగా స్వచ్ఛ కార్యకర్త కొప్రపాటి వీరసింహుడు రూ. 10,116 అంజేశారు. తన మేనత్త రావెళ్ల వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం విరాళాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. వీరసింహుడు ఆయన భార్య ఇందిర ఇద్దరూ కలిసి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌కు అందజేశారు.

కానిస్టేబుల్‌పై దాడి!

జల్లెడ పడుతున్న పోలీసులు

పెడన: కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో దాడికి పాల్పడిన వారిని పట్టుకునేందుకు పోలీస్ యంత్రాంగం జల్లెడ పడుతోంది. సేకరించిన వివరాల మేరకు కానిస్టేబుల్ రాజులపాటి వీరబాబు, అతని బావ నాగరాజు ఈ నెల 8న మచిలీపట్నం మండలంలో గ్రామ దేవత సంబరానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామం బంటుమిల్లి మండలం ఆర్తమూరు గ్రామానికి ట్రాక్టరులో బంధువులతో కలిసి బయలుదేరారు. పెడన - బంటుమిల్లి రోడ్డులోని చూజీ కంపెనీ సమీపంలో వీరి ట్రాక్టరును కొందరు గుర్తు తెలియని యువకులు ఆపారు. ఎందుకు ఆపారని వారిని ప్రశ్నించినందుకు కానిస్టేబుల్ వీరబాబుపై దాడి చేశారు. అడ్డువెళ్లిన వీరబాబు బావ నాగరాజుపై కూడా దాడి చేశారు. ఘటన ఎస్పీ గంగాధరరావు దృష్టికి వెళ్లడంతో ఆయన సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ కావడంతో పెడన నియోజకవర్గంలోని ఆయా స్టేషన్లకు చెందిన ఎస్‌ఐలు, మచిలీపట్నం, గుడివాడ పట్టణానికి చెందిన సీఐలు, పెడన సీఐతో పాటు సిబ్బంది.. దాడి చేసిన వారిని పట్టుకునేందుకు జల్లెడ పడుతున్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో సమాచారం కోసం సంప్రదించగా ఎవరూ అందుబాటులో లేరు. ఫోన్లు చేసినా స్పందించడం లేదు.

రోడ్లపైనే నిర్మాణ సామగ్రి

- మచిలీపట్నంలో రహదారులపైనే మిక్సర్లు, కాంక్రీట్ పనులు
- షేక్ ఇమాం స్ట్రీట్‌లో డ్రెయిన్‌లను ధ్వంసం చేస్తున్నా పట్టని వైనం
- స్పందించని ఎంఎంసీ అధికారులు



షేక్ ఇమాం స్ట్రీట్‌లో రోడ్డుపైనే మెటీరియల్‌ను ఉంచి పనులు చేస్తున్న భవన నిర్మాణదారుడు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ భవన నిర్మాణదారుల వ్యవహార శైలితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రిని డంప్ చేస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన కాంక్రీట్ కోసం మిక్సర్ వాహనాలను సైతం రోడ్లపై నిలిపి పని చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. భవన నిర్మాణానికి జరిపిన తవ్వకాల వద్ద నీటి జలను తొలగించేందుకు నీటి పైప్‌లు రోడ్లపైనే వదిలేస్తుండటంతో ఆ ప్రాంతాల్లోని రోడ్లు జలమయంగా మారుతున్నాయి. భవన నిర్మాణదారులు ఆర్థిక, రాజకీయ పలుకుబడిదారులు కావటంతో నగరపాలక సంస్థ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే వాదనలు వినవస్తున్నాయి.

బెల్లంకొట్ల సందులో..

నగరంలోని బెల్లంకొట్ల సందులో చేపల మార్కెట్‌ను ఆనుకుని రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవిలో కొనసాగుతున్న వ్యక్తి ఓ పెద్ద భవనాన్ని నిర్మిస్తున్నాడు. నిర్మాణ ప్రారంభం నుంచి ఆ ప్రాంత వాసులు, వాహనచోదకులు నానాఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆ రోడ్డులో ఎక్కువగా వ్యాపార సముదాయాలు ఉండటంతో రద్దీగా ఉంటుంది. ఆ ప్రజాప్రతినిధి భవన నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి మమ్మల్ని ఎవడ్రా ఆపేది అన్న చందంగా పనులు చేస్తూనే ఉన్నారు. రోడ్లపైనే మెటీరియల్ ఉంచటంతో పాటు కాంక్రీట్ మిక్సింగ్ పనులు అక్కడే చేస్తుండటంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.



షేక్ ఇమాం స్ట్రీట్‌లో భవన నిర్మాణదారుడి నిర్వాహకంతో పడిపోయిన పక్కా డ్రెయిన్ గోడ



రోడ్డుపైనే కాంక్రీట్ మిక్సర్ పనులు చేస్తున్న దృశ్యం

షేక్ ఇమాం స్ట్రీట్‌లో..

నగరంలోని రామానాయుడుపేటలోని షేక్ ఇమాం స్ట్రీట్‌లో ఓ వ్యాపారి భారీ భవనాన్ని నిర్మిస్తున్నాడు. పునాదుల్లో నీటిని తోడే పనుల ప్రారంభం నుంచి నిర్మాణ పనులను రెండు ప్రాంతాలను కలిపే ప్రధాన రహదారిపైనే నిర్వహిస్తుండటంతో అటుగా ప్రయాణించే వాహనదారులకు అవస్థలు తప్పటం లేదు. ఆ ప్రాంతంలోని పక్కా డ్రెయిన్ గోడలు సైతం పగిలిపోగా వాటిని తొలగించి పక్కన పడేసినా ఎంఎంసీ అధికారులకు చీమైనా కుట్టినట్లు లేదని ప్రజలు వాపోతున్నారు. భవన నిర్మాణదారుడ్ని అదేమని అడిగితే వేరే ప్రత్యామ్నాయ రోడ్డులో వెళ్లలేరా అని వాగ్వాదానికి దిగుతుండటంతో వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల కొద్ది రోజులుగా తరచూ రేయింబవళ్లు ఇదే తంతు జరుగుతుండటంతో వాహనచోదకులు విసుగు చెందుతున్నారు. ఈ సమస్యపై ఎంఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు.

నోటీసులు ఇచ్చాం.. చర్యలు తీసుకుంటాం

భవన నిర్మాణ మెటీరియల్‌ను రోడ్లపై వేయటం, పనులు రోడ్లపైనే చేస్తున్న నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చాం. అయినా స్పందించకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. అపరాధ రుసుం వసూలు చేస్తాం.

– హరిప్రసాద్, టౌన్‌ప్లానింగ్ అధికారి, ఎంఎంసీ

ఎస్సీ, ఎస్టీలను అవమానించడమే

మాల మహానాడు జిల్లా నేత దోవా గోవర్ధన్



అవనిగడ్డ: అమరావతిపై ఓ టీవీ డిబేట్‌లో జరిగిన సంభాషణను ఎస్సీ, ఎస్టీలకు ముడిపెట్టడం వారిని అవమానించడం కాదా అని జిల్లా మాల మహానాడు నేత దోవా గోవర్ధన్ అన్నారు. అవనిగడ్డలో గోవర్ధన్ విలేకర్లతో మంగళవారం మాట్లాడుతూ అమరావతిని దూషించినవారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం ఏంటని, అమరావతిలో అందరూ ఎస్సీ, ఎస్టీలే నివసిస్తున్నారా, వారే ఆ వృత్తి చేస్తున్నారా, పోలీసులు, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలన్నారు. సాక్షాత్తు రాష్ట్ర హోంమంత్రి ఎస్సీ కులానికి చెందిన మహిళ అనే సంగతి తెలిసిందేనన్నారు. గుంటూరు పోలీసులకు కొత్త రాజ్యాంగం ఏమైనా ఉందా.. ఎస్సీ, ఎస్టీలను రోడ్లమీద కొట్టడానికి, వాళ్లను వ్యభిచారులుగా చిత్రీకరించి అవమానించడానికా అంటూ ప్రశ్నించారు. మీ రాజకీయ కక్షలకు అట్రాసిటీ కేసులు వాడుకోవడం సరికాదని, ఎస్సీ, ఎస్టీలను వారి అవసరాలకు వాడుకునే వస్తువులుగా పరిగణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు ప్రభుత్వాలు ఈ వైఖరి మార్చుకోవాలని, లేదంటే న్యాయస్థానాల్లో సంజాయిషీ చెప్పుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దళితులను ఇలా అవమానించిన గుంటూరు పోలీసుల తీరు అనైతికమని వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామని గోవర్ధన్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు విచారకరం

మచిలీపట్నంటౌన్: సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావును రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగానే అరెస్టు చేసిందని ఆయన అరెస్టు విచారకమని మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మినేనిని అరెస్టు చేయటం పత్రికా స్వేచ్ఛను హరించటమేనని ఆయన అభిప్రాయపడ్డారు. సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడటం హేయమని పేర్కొన్నారు.

13న కొండలమ్మకు లక్ష మల్లెల పూజ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారికి లక్ష మల్లెల పూజను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పంతో పాటు తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యం



గూడూరులో జరిగిన కిశోర వికాసం

గూడూరు: బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే కిశోర వికాసం ప్రధాన ఉద్దేశమని ఐసీడీఎస్ మల్లవోలు సెక్టార్ సూపర్‌వైజర్ జన్ను రేవతి అన్నారు. కిశోర వికాసం–వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐదుగుళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కిశోర బాలబాలికల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. రేవతి మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు అభ్యసించేలా తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలన్నారు. బాల్యవివాహాలతో యువతులు అనేక రుగ్మతల బారిన పడుతున్నారని, 18 ఏళ్లు నిండిన తర్వాత పెళ్లి చేస్తే వారు వైవాహిక జీవితాన్ని సాఫీగా సాగిస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వెంకటేశ్వరమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం కిశోరి బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు.



విద్యార్థినిలను సన్మానిస్తున్న మధు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు

పెడన: వయసు 18 ఏళ్లు నిండిన తరువాతే యువతులు పెళ్లి చేసుకోవాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి ఆఫీసర్ కె.మధు అన్నారు. మంగళవారం ఒకటో వార్డులోని అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోర వికాశం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మధు మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు ఇంటి వద్ద బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్ల జోలికి పోవద్దని తెలిపారు. అనంతరం పది ఫలితాల్లో టౌన్ ఫస్ట్ వచ్చిన బాలికను, బాలిక తండ్రిని, కిశోర వికాశం తరగతులకు రెగ్యులర్‌గా హాజరైన బాలికలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి, పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామసభలు

మోపిదేవి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులకు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జె.స్వర్ణభారతి తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు మండలంలో జరిగిన పనుల వివరాలు, గ్రామ సభల షెడ్యూల్స్‌ను మంగళవారం వివరించారు. బొబ్బర్లంకలో ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు, పెదప్రోలులో ఉదయం 11 గంటలకు, వెంకటాపురంలో ఉదయం 10 గంటలకు, కోసూరువారిపాలెంలో ఉదయం 10 గంటలకు, కె.కొత్తపాలెంలో ఉదయం 10 గంటలకు, మోపిదేవిలో సాయంత్రం 4 గంటలకు ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు ఉంటాయని తెలిపారు.

17వ తేదీ పెదకళ్లేపల్లిలో ఉదయం 11 గంటలకు, 19వ తేదీ మేళ్లమర్తిలంక, కొక్కిలిగడ్డ, ఉత్తరచిరువోలులంకలో మధ్యాహ్నం 3 గంటలకు, మెరకనపల్లి, మోపిదేవిలంక, నాగాయితిప్ప పంచాయతీలో సాయంత్రం 4 గంటలకు ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు ఉంటాయని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమావేశం 21వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

27 వరకు ఆధార్ నమోదు శిబిరాలు

గూడూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈ నెల 27 వరకు ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోటేపల్లి వనజ తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు పోసినవారిపాలెం, కంకటావ, కప్పలదొడ్డి సచివాలయాల్లో, 24 నుంచి 27 వరకు మల్లవోలు–1 తరకటూరు, ఆకులమన్నాడు, లేళ్లగరువు సచివాలయాల పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఇప్పటి వరకు ఆధార్ నమోదు కాని చిన్నారులకు నమోదు చేయడంతో పాటుగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ కూడా చేస్తామని ఆమె వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోండి

దేవరకోట(ఘంటసాల): ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ ఘంటసాల సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమానాగమణి అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట అంగన్‌వాడీ కేంద్రం -2లో అంగన్‌వాడీ పిలుస్తోంది, కిశోరి వికాశం కార్యక్రమాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమానాగమణి మాట్లాడుతూ మూడేళ్లు దాటిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. బాలికలకు చిన్నతనంలోనే గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, వ్యక్తిగత పరిశుభ్రత పై బాలికలకు అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలు అరికట్టాలని రమా నాగమణి తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను చేర్పించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు ఎం.నాగస్వర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు బేబీ షాలిని, బసవలక్ష్మి, నాగభవాని, ఆయాలు, చిన్నారులు, బాలికలు పాల్గొన్నారు.



దేవరకోటలో జరిగిన ర్యాలీలో..

అవనిగడ్డలో..

సమాజంలో బాల్య వివాహలను అరికట్టాలని అవనిగడ్డ సర్పంచ్ గొరుముచ్చు ఉమ అన్నారు. మండల పరిధిలోని అవనిగడ్డ, పులిగడ్డ గ్రామాల్లో కిశోరి వికాసం బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు ఉమ, దాసరి విజయ్ కుమార్, సీడీపీవో శేషు కుమారి, సూపర్‌వైజర్ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడి

పాపవినాశనం(ఘంటసాల): వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలతో రైతులు ఈ ఏడాది అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆశించారు. ఘంటసాల మండలం పాపవినాశనం పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు రాయితీపై అధునాతన యంత్ర పరికరాలను అందిస్తుందన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణ మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో 332 క్వింటాళ్ల ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంపటి అనిత, మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, మాజీ ఏంఏసీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు బోయిన నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి అన్వర్ షరీఫ్, వీఏఏ ఎం.లావణ్య, రైతులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఘంటసాల ఏవో మురళీకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

- మండలంలో 8 ఏళ్ల పాటు ఏవోగా పని చేసిన మురళీకృష్ణ బదిలీపై చల్లపల్లి మండలం వెళ్తున్న సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఏవో మురళీ కృష్ణను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

రేషన్ పంపిణీ వాహనాలను కొనసాగించాలి

కంకిపాడు: రేషన్ పంపిణీ వాహనాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రంగారావు డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీలో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు.

రంగారావు మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులు ప్రజల ఇంటి వద్దకే చేరాయన్నారు. రేషన్ అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో డిపోల వద్ద నుంచి సరుకులు తెచ్చుకోవాలని సూచించటం సరైంది కాదన్నారు. అక్రమ రవాణాను అడ్డుకుంటూ ప్రజలకు ఇంటికే రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీకి బదులుగా నగదు బదిలీ ఆలోచన ఉపసంహరించుకోవాలని కోరారు. పార్టీ నేతలు తాడంకి నరేష్, వి.శివశంకర్, సీహెచ్ శ్రీహరి, జి.కుమారి, కె.నాంచారయ్య, టీ దివ్యప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- పెడనలో ఎన్టీఆర్ పార్కు
- అభివృద్ధికి దూరంగా..
- అపరిశుభ్రంగా పార్కు ప్రాంగణం
- ఆవరణలో పాముల పుట్ట



పార్కులో కొన్ని వ్యాయామ పరికరాలు నిరుపయోగంగా..

పెడన: పట్టణంలోని 14వ వార్డులో ఉండే ప్రధాన ఉద్యానవం.. ఎన్టీఆర్ పార్కు. ఇది అభివృద్ధికి దూరంగా ఉంది. ఒకప్పుడు సందర్శకులతో కళకళలాడే పార్కు నేడు దీన స్థితికి చేరింది. మందుబాబులకు నిలయంగా మారింది. ఉదయపు నడక వారితో పాటు కొద్ది సేపు వ్యాయామాలు చేద్దామనేకునే వారికి ఎంతో ఉపయుక్తంగా ఉండే పార్కు పాముల భయంతో అటుగా అడుగులు వేయడం లేదు. వేసవి వచ్చిందంటే చాలు చిన్నారులతో సందడి సందడిగా ఉండేది. పార్కులో విపరీతంగా పెరిగిపోయిన చెట్లు, స్థానికులు వారు వారి ఇళ్లలోని చెత్తను సైతం పార్కులో వేస్తుండటంతో నేడు అపరిశుభ్రంగా కనిపిస్తోంది. బాగు చేయిస్తే పెద్దలు, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సందర్శకుల సంఖ్య పెరుగుతుందని తెలిసినా పట్టించుకోకపోవడం సరికాదు.

అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి

పార్కును అభివృద్ధి చేయడానికి 15వ ఆర్థిక సంఘ నిధులు కేటాయించారు. రూ.5.16లక్షలతో పార్కును అభివృద్ధి చేయనున్నాం. పార్కు పూర్తిగా దెబ్బతినడంతో సందర్శకుల సందడి తగ్గింది. పార్కు ప్రధాన గేటు, వెనుక గేట్‌లతో పాటు నేమ్ బోర్డు, పార్కులోని వాటర్ ఫౌంటెన్, సందర్శకులు కూర్చేనేందుకు దెబ్బతిన్న సిమెంట్ బెంచీలు, పైపు లైన్లు, విద్యుత్ లైట్లు, చిన్నారులకోసం ఊయల ఏర్పాటు కానున్నాయి. పార్కులోపల నడక మార్గం దెబ్బతినడంతో దానిని బాగు చేయనున్నాం. కొత్తగా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షించనున్నాం. త్వరలో పనులు కూడా మొదలు పెడతాం.



– కాగిత సీతారామాంజనేయులు, ఏఈ, పురపాలక సంఘం, పెడన



పార్కు నేమ్ బోర్డు ఇలా



మరమ్మతులకు గురైన వాటర్ ఫౌంటెన్



పార్కు లోపల పుట్ట

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన



ఘంటసాల: ఘంటసాల బౌద్ధ స్తూపం వద్ద నిర్వహించే జిల్లా స్థాయి యోగాంధ్రలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని యోగాంధ్ర జిల్లా సమన్వయ అధికారి, విజిలెన్స్ సివిల్ సప్లయిస్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు అన్నారు. ఘంటసాలలోని బౌద్ధ స్తూపం వద్ద ఈ నెల 13న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లను డెప్యూటీ కలెక్టర్ స్థానిక అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఈ నెల 13న ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అక్కడ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జావేద్ ఖాన్, ఆయుష్ డాక్టర్ వాహిని, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, ఆర్ఐ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.